



కాగజ్‌నగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

తీరనున్న కష్టాలు

- కాగజ్‌నగర్‌లో అండర్ బ్రిడ్జి పనులకు మోక్షం
- సర్వేలు పూర్తి చేసిన అధికారులు
- సంజీవయ్యకాలనీ బోర్డు నుంచి పాత గేటు వరకు నిర్మాణం

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 31: కాగజ్‌నగర్ వాసులకు త్వరలోనే కష్టాలు తీరనున్నాయి. ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు సర్వేలు పూర్తి చేశారు. కాగజ్‌నగర్ నుంచి ఈస్‌గాం వైపునకు వెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.4.50 కోట్లతో రైల్వే ట్రాక్ కింద భాగంలో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాగజ్‌నగర్ సంజీవయ్య కాలనీ బోర్డు నుంచి పాత గేటు వరకు అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. వారం రోజులుగా అధికారులు సర్వేలు చేస్తున్నారు. ఈ సర్వేల్లో ప్రధానంగా ఎన్ని ఇళ్లు తొలగించాలి..? ఎంత మేర నష్టం వాటిల్లుతుంది..? అనే కోణంలో ఇంజనీరింగ్ అధికారులు సర్వేలు చేస్తున్నారు. కాగా ఇంజనీరింగ్ అధికారులు ప్రాథమిక నివేదికలో 19 ఇళ్లు తొలగించాల్సి వస్తోందని తెలిసింది. అండర్ బ్రిడ్జి చేపట్టే స్థలాన్ని మూడు రోజుల క్రితం సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు కూడా స్వయంగా పరిశీలించారు. కాలనీవాసులతో కూడా నేరుగా మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

● ప్రధాన రోడ్డుపై..

కాగజ్‌నగర్‌లో ప్రధాన రోడ్డుపై గతంలోనే ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. దీంతో కాగజ్‌నగర్ నుంచి ఈస్‌గాంతో పాటు ఇతర మండలాలకు వెళ్లేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జి అనుకూలంగా ఉండేది. ఏళ్లు గడిచినా మెట్లు మాత్రం నిర్మించలేదు. రైల్వే ఓవర్ బ్రిడ్జికి సమీపంలో గ్రామాలు కాగజ్‌నగర్‌కు ఆనుకొని ఉన్నాయి. వీరంతా కాగజ్‌నగర్‌కు రావాలంటే రైల్వే ఓవర్ బ్రిడ్జి నుంచే చేరుకోవాలి. బ్రిడ్జి చేపట్టేకపోవడంతో కనీసం రెండు కిలోమీటరు దాటి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమస్యను పరిష్కరించాలని పలు మార్లు రైల్వే అధికారులకు వినతి పత్రాలు సమర్పించినా పనులు ప్రారంభించలేదు. అలాగే ఆర్ అండ్ బీ అధికారుల దృష్టికి తీసుక పోయినప్పటికీ కూడా ఇంత వరకు సమస్య పరిష్కారం కాలేదు. దీంతో కాగజ్‌నగర్ ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలు రాకపోకలకు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం తాజాగా పట్టణాల సమీపంలోని ట్రాక్‌ల వద్ద అండర్ బ్రిడ్జిల కోసం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు కాగజ్‌నగర్ నెంఎల్‌సీ77 సంజీవయ్య కాలనీ ప్రాంతం నుంచి అండర్ బ్రిడ్జి నిర్మాణం ఎంతో అవసరం ఉందని అధికారులు, నాయకులు నివేదికలు రూపొందించడంతో కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇంజనీరింగ్ అధికారులు సర్వే పూర్తి చేశారు. ప్లాన్ వేసిన తర్వాత టెక్నికల్ అనుమతులు రాగానే పనులు ప్రారంభించేందుకు అధికారులు శరవేగంగా చర్యలు తీసుకోనున్నారు. పరిహారం విషయంలో ఏమేరకు ఇస్తారోనన్నది తేలాల్సి ఉంది. కాగజ్‌నగర్‌లో చని పోయిన వారికి అంత్యక్రియలు నిర్వహించాలంటే ఓవర్ బ్రిడ్జి అవతల ఉన్న మోక్షధాం వెళ్లాల్సి ఉంది. దీంతో ఓవర్ బ్రిడ్జి ఎక్కి కాగజ్‌నగర్-జగన్నాథ్‌పూర్ సమీపంలోని పెద్ద వాగు వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఈ అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగే కేవలం అర కిలోమీటరు దూరంలోనే శ్మశాన వాటికకు చేరుకునేందుకు అవకాశం ఉంది.

పరిహారం చెల్లించాలి..

- జాకీర్ ఖురేషి, సంజీవయ్యకాలనీ



ఇళ్లు కోల్పోతున్న వారికి నూతన చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి. పరిహారం కూడా న్యాయబద్ధంగా ఉండాలి. ఇళ్లు పోవడంతో నిరాశ్రయులవుతారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పరిహారం ఉం డాలి. అధికారులు స్పందించి పేదలకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

అధికారులు త్వరగా పనులు చేపట్టాలి..

-హబీబ్, కాగజ్‌నగర్



పట్టణవాసులు ఇబ్బందులు తొలగించేందుకు అండర్‌బ్రిడ్జి పనులు త్వరగా చేపట్టాలి. కాగజ్‌నగర్‌కు ఆనుకొని సీబాపు కాలనీ, ఈసుగాం, భట్టుపల్లి ఉన్నాయి. వీరంతా నిత్యం రైల్వే ఓవర్ బ్రిడ్జి ఎక్కి రావాల్సి ఉంటుంది. అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే కేవలం అరకిలోమీటరు దూరంలోనే కాగజ్‌నగర్‌కు చేరుకునే అవకాశాలున్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

కాగజ్‌నగర్‌లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



కాగజ్‌నగర్‌లో ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ కరుణాకర్, సిబ్బంది

కాగజ్‌నగర్, మార్చి 31: కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం పట్టణ పలు వీధుల గుండా సాగింది. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ కరుణాకర్ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎంపీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా కూడా తమదృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ శంకరయ్య, సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, ఎస్సైలు అంజయ్య, మహేందర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు ప్రజలు సహకరించాలి



జైనూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జైనూర్, మార్చి31: రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహిం చేందుకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ సదయ్య అన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు ప్రధాన వీధుల్లో ఆదివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని వ్యాపారులు కోటగిరి విశ్వనాథ్, కోటగిరి శ్రీనివాస్, రమేష్, గోపాల్ , ఇక్బాల్ తదితరులు పోలీసు కవాతులో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం డీఎస్పీ సదయ్య మాట్లాడుతూ మరి కొద్ది రోజుల్లో ప్లామెంట్ ఎన్నికలు నర్వహిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య ఎస్సై సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



పంచాంగం ఆవిష్కరిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్, మార్చి 31: దూపదీప నైవేద్యం పథకంలో పని చేస్తున్న అర్చకుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణశర్మ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో క్రోధినామ సంవత్సరం పంచాంగ ఆవిష్కరణ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు శిరీష్ శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ శర్మలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీడీఎన్ అర్చకులకు పెండింగ్ వేతనాలతో పాటు ప్రతి నెల 5న వేతనాలు విడుదల చేయాలన్నారు. నూతనంగా నియమించబడిన అర్చకులకు వేతనాలు చెల్లించాలని, కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ శర్మ, తిరుఎతిచారి, మహేష్‌శర్మ, ప్రశాంత్, విజయ్‌కుమార్, సూర్యనారాయణ, బాపుదేవ్, అభయ్‌కమార్, సతీష్, శంకరయ్య, సత్యనా రాయణ తదితరులు పాల్గొన్నారు.

యువత తరలిరావాలి

జైనూర్, మార్చి31: కెరమెరి మండల కేంద్రంలో ఏప్రిల్ 20 నుంచి 29 వరకు నిర్వహించనున్న సమతా సైనిక్ దళ శిబిరాలను యువత తరలిరావాలని సైనిక్ కేంద్ర రాష్ట్ర కమిటీ సభ్యులు మార్షల్ రవింద్ర జాబాడె కోరారు. మండల కంద్రంలో ఆయన ఆదివారం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ శిక్షణా శిబిరానికి లింగాపూర్, కెరమెరి, నార్నూరు, కెరమెరి మండలాల నుంచి యువతి యువలకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ శిక్షణలో జీవితంలో మంచి మార్పులు, చక్కటి మార్గాలు అన్వేషించడానికి ఎంతో దోహదపడుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర కోఅర్డినేటర్ శీలానంద్ కాంబ్లే, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పాపేష్ బన్సోడె, రాష్ట్ర శిక్షణ అధికారులు విక్రం కాంబ్లే, అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు సత్యవాన్ కాంబ్లే, సిద్ధార్థ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 31: మండలంలోని బూర్గుడ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు అయ్యాయి. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్‌కు చెందిన తిరుపతి, వాంకిడికి చెందిన సచిన్‌లు బంధువులు. వీరు ఆదివారం ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడలో శుభకార్యానికి వచ్చారు. మధ్యాహ్నం చిలాటిగూడ నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. బూర్గుడ జాతీయ రహదారి దాటుతుండగా మంచిర్యాల వైపు నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో సచిన్ ముఖానికి గాయాలు కాగా తిరుపతి కాలు విరిగింది. కా రు ముందు భాగం దెబ్బతిన్నది. వెంటనే వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు రెఫర్ చేశారు. సచిన్‌ను చంద్రాపూర్ ఆసుపత్రికి, తిరుపతిని మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

ప్రజల భద్రతకే కార్డన్‌సెర్చ్

పెంచికలపేట, మార్చి 31: ప్రజాభద్రత కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కిరాణ దుకాణంలో ఆకస్మికంగా సోదారులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ నేరాల నియంత్రణకై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. ప్రజలు చట్టానికి లోబడి తమ తమ వ్యవమరాలు చేసుకోవాలని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా ప్రజల సహకరించాలని ఆయన అన్నారు. యువత సన్మార్గంలో నడవాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన అన్నారు. నేర రహిత గ్రామంగా తీర్చిదిద్దండంలో యువత పాత్ర కీలక మని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు కొమురయ్య, రాజు, విక్రం, పోలీసులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాంబాబు

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

వాంకిడి, మార్చి 31: వాంకిడి మండలం సోనాపూర్‌కు చెందిన కొడప రాము(31) అనే యువకుడు ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాముకు రెండేళ్ల క్రితం సోనాపూర్‌కు చెందిన రంబబాయితో వివాహం జరిగింది. కొన్ని రోజుల నుంచి వీరిద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఆమె హోలీ పండగకు పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ క్రమంలో రాము మద్యానికి బానిసై మద్యం తాగి వచ్చి తన తల్లితో గొడవ పడేవారు. నీవల్లే భార్య కాపురానికి రావడం లేదని గొడవ చేసేవాడు. శనివారం సాయంత్రం తన భార్య ఇంటికి వెళ్లాడు. రాత్రి అక్కడే భోజనం చేసి పడుకున్నాడు. ఆదివారం తెల్లవారు జామున 4 గంటలకు రాము తన ఇంటికి వచ్చి పడుకున్నాడు. తల్లి మెంగుబాయి ఉదయం 7 గంటలకు లేచి చూసే సరికి రాము తన ఇంట్లో దూలానికి వెలాడుతూ కనిపించాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బావిలో దూకి వృద్ధుడు..

బెజ్జూరు, మార్చి 31: బెజ్జూరు మండలం పోతెపల్లి గ్రామానికి చెందిన రౌతు పెద్ద నర్సయ్య(78) అనే వృద్ధుడు ఆదివారం వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. నర్సయ్య కొంత కాలంగా క్షయవ్యాధితో బాధపడుతు న్నాడని ఆసుపత్రిలో చికిత్సలు చేసుకున్నప్పటికీ నయం కాక పోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడగా అటు వైపుగా వెళ్లే రైతులు బావి వద్ద చెప్పులు చూసి అనుమానంతో బావిలో తొంగి చూడగా బావిలో మృత దేహం కనిపించడంతో గ్రామస్థులకు సమాచారం అందించారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపటి నుంచి ప్రత్యేక పూజలు

చింతలమానేపల్లి, మార్చి 31: మండలంలోని కర్జవెల్లిలో నూతనంగా నిర్మించిన ఓంకార ఆశ్రమ శ్రీరాధాకృష్ణ మందిరంలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సింగరేణి సమాచారం

మందమర్రి ఏరియాలో

92 శాతం బొగ్గు ఉత్పత్తి

మందమర్రిటౌన్, మార్చి 31 : మందమర్రి ఏరియాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 46.10 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించగా ఆదివారంతో వార్షిక ఉత్పత్తి లక్ష్యం ముగిసింది. ఏరియా 42 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 92 శాతంతో నిలిచింది. ఏరియాలోని శాంతిఖని గని, కాసిపేట, 1, 2, కేకే 5 , కేకే ఓసీపీ, ఆర్కే. ఓసీపీలు ఉన్నాయి. కేకే 5 గని వందకు వంద శాతం ఉత్పత్తి సాధించింది. ఆర్కే. ఓసీపీకి 14 లక్షల టన్నులు నిర్దేశించగా 18.80 లక్షల టన్నులు సాధించి రికార్డు స్థాయి ఉత్పత్తితో ఏరియాలోనే ముందు నిలిచింది. ఆర్కే. ఓసీపీ ఉద్యోగులను, అధికారులను ప్రత్యేకంగా జీఎం మనోహర్ అభినందించారు. ఉత్పత్తి లక్ష్య సాధన కోసం ఏరియా జీఎం మనోహర్ సమావేశాలు, సూచనలు ఇస్తూ ఉత్పత్తి సాధనకు కృషి చేశారు. భూగర్భ గనుల్లో కేకే 5 గని ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది.

కార్మికులకు జీఎం అభినందన

రామకృష్ణాపూర్, మార్చి 31 : ఈ ఆర్థిక సంవత్సరంలో మందమర్రి ఏరియా జీఎం మనోహర్ ఆధ్వర్యంలో ఆర్కేపీ సీఎస్పీలో శనివారం ఒకే రోజు 28 వేల టన్నుల రవాణా చేసిన కార్మికులను ఆదివారం జీఎం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1977లో ఆరంభమైన ఆర్కేపీ సీహెచ్‌పీ 47 సంవత్సరాలలో ఎప్పుడు కూడా 7 రేకుల రవాణా జరగలేదన్నారు. మందమర్రి ఏరియాలో ఆర్కేపి సీఎస్పీకి నిర్దేశించిన 22 లక్షల టన్నుల బొగ్గు రవాణాకు గాను దాదాపు 31 లక్షల టన్నుల రవాణా చేసినందుకు జీఎం సీఎస్పీ కార్మికులను అభినందించారు.

కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలి

- పేదల శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం
- దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయం
- పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క



కౌటాలలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

కౌటాల, మార్చి 31: జిల్లా అభివృద్ధికి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించేందుకు ప్రజలు ఓటు వేయాలని పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క అన్నారు. కౌటాల మండల కేంద్రంలో ఆదివారం ఆదిలాబాద్ పార్లమెంట్ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన నెహ్రూ, గాంధీ వారసులైన రాహుల్‌గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి దేశాభివృద్ధికి సహకరించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. గాంధీ కుటుంబానికి 34 సంవత్సరాల తరువాత మళ్లీ ప్రధాని అయ్యే అవకాశం రాహుల్ గాంధీ రూపంలో ఉందన్నారు. మోదీ పదేళ్ల పాలనలో కుల మతాల చిచ్చు పెట్టి దేశాన్ని నాశనం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి, ఉద్యోగాలు అడిగితే అక్షింతలు పంపించి దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ విధానాలు చూసి ఓటు వేసి దేశాభివృద్ధికి సహకరించాలన్నారు. పేదల శ్రేయస్సే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రూ.500 ఉన్న గ్యాస్ సిలిండర్ రూ.1200, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటించి ప్రజల నడ్డి విరిచారని చెప్పారు. మళ్లీ రాష్ట్రంలో రూ.1200 సిలిండర్‌ను రూ.500లకే ఇస్తున్నామన్నారు. కరోనా కష్ట కాలంలో కేంద్ర ప్రభుత్వం ఎవరికి సహకారం అందించలేదని నల్లధనంతో ప్రతీ ఒక్కరికి రూ.15 లక్షలు వేస్తానని చెప్పి ప్రజలను మోసం చేశారని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణ పేరుతో మారు మూల గ్రామాల అభివృద్ధి అడ్డుకుం టుందని ప్రజల అవసరాల నిమిత్తం చేసే పనులకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఇప్పటికే 92 శాతం మందికి రైతు బంధు ఇచ్చామని, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. ప్రతిపక్షాలపై బురద చల్లడం ప్రధాని మోదీకి వెన్నెతో పెట్టిన విద్య అని గత పదేళ్లుగా ప్రభుత్వాలను కూలుస్తున్న ఘనత కూడా బీజేపీకే దక్కుతుందన్నారు. అనంతరం మండలానికి చెందిన యువకులు వినోద్, వాయుకుమార్, శ్రీకాంత్‌లు ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క నామినేష్ కోసం రూ.3 వేలు అందజేశారు. కాగా మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి ఆదివారం మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో తన అనుచరులతో కలిసి చేరారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, కాంగ్రెస్ అభ్యర్థి సుగుణకుమారి గెలుపుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కేసీఆర్‌ను నట్టేట ముంచుతారని అన్నారు. రాబోయే కాలంలో గడీల పాలన బద్దలు కొట్టి దొరలను జైళ్లకు పంపిస్తానని చెప్పిన ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్‌లో చేరగానే కవితను జైలుకు పంపించారని ఎద్దేవా చేశారు. త్వరలో సంతోష్‌రావును కూడా జైలుకు పంపిస్తాడని అన్నారు. సీఎం కేసీఆర్‌కు ప్రవీణ్‌కుమార్‌తో ముప్పు ఉందన్నారు. కేసీఆర్ అంటే తనకు గౌరవమని కేసీఆర్ కుటుంబాన్ని, తనను నోటికి వచ్చినట్లు విమర్శించిన ప్రవీణ్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీలో చేరితే వారికి జై కొట్టలేకనే కాంగ్రెస్ పార్టీలో చేరనని తెలిపారు. విద్వేశాలు రెచ్చగొట్టి బహుజన వాదం అంటూ బహు జనులను నట్టేట ముంచిన ప్రవీణ్‌కుమార్ బీజేపీ ప్యాకేజీ లీడరని విమ ర్శించారు. అనంతరం ఇటీవల వార్ధా నదిలో మృతిచెందిన నలుగురు కుటుబ సభ్యులు తమ మొర పెట్టుకోగా వారిని ఓదారుస్తూ ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామన్నారు. అనంతరం పలువురు మంత్రి సీతక్క వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణతో పాటు జడ్పీ చైర్మన్ కృష్ణారావు, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, నాయకులు భాస్కర్, రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, ఎంపీపీలు, జడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

● బాధిత కుటుంబానికి పరామర్శ

సిర్పూర్(టి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి దుర్గం భాస్కర్ కుటుంబ సభ్యులను మంత్రి సీతక్క ఆదివారం పరామర్శించారు. దుర్గం భాస్కర్ సోదరుడు చంద్రశేఖర్ మృతి చెందడంతో మంత్రి సీతక్క కౌటాలకు వెళ్తున్న సందర్భంగా చంద్రశేఖర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల సహాయసహకారాలు అందిస్తామన్నారు. అలాగే నాగమ్మ చెరువులో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సొంత డబ్బులతో నిర్మించిన బుద్ధుడి విగ్రహాన్ని పరిశీలించారు. శివాజీ జయంతిని ప్రభుత్వ పరంగా నిర్వహించాలని ఆరె సంఘం మండలాధ్యక్షుడు శంకర్ వినతి పత్రం అందజేశారు. పలువురు పలు సమస్యలపై వినతులు సమర్పించారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్, శ్యాంనాయక్, కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ, దుర్గం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠాపన

దహెగాం, మార్చి 31: దహెగాం మండలం ఖర్జి గ్రామంలో ఈ నెల 2న నుంచి 4వ తేదీ వరకు అభయాంజనేయ సహిత శివపంచాయతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ అర్చకులు దిలీప్ శర్మ తెలిపారు.

పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

ఆసిఫాబాద్, మార్చి 31: జన్కాపూర్ ఎంపీపీఎస్‌లో పీఎస్‌హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న దుర్గం భాస్కర్ పదవీ విరమణ పొందడంతో ఆదివారం ఎస్టీయూ భవనలో ఘనంగా సన్మానించారు. డీఈవో అశోక్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ బాధ్యతతో విధులు నిర్వర్తిం చినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ ఉపాధ్యాయులు తుకారాం, మానిక్‌రావు, ఎంఈఓ మనుకుమార్, సుభాష్, జబ్బార్, వెంకటేశ్వర్లు, శంకర్, ప్రబోద్, ఇందురావ్, శంకర్, రాజశేఖర్, సంతోష్, బాదిరావు, తిరుపతి, సంతోష్, శారద, కాలిదాస్, అనూష పాల్గొన్నారు.

'ఐదు తెగలకు న్యాయం చేయాలి'

కెరమెరి, మార్చి 31: రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీల్లోని ఐదు తెగలకు సము చిత న్యాయం చేయాలి కోలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు అ న్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాయిసెం టర్‌లో కొలాం, ప్రదాన్, తోటి, నాయకపోడ్, ఆంద్ తెగలకు చెందిన నాయకులతో కలిసి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివా సీల్లో అయిదు తెగలపై వివక్ష చూపుతున్నారని, రాజకీయాల్లో సముచత స్థానం కల్పించి సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, నగేష్, సుభాష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరులో ట్రాఫికర్

- వారసంత రోజు వాహనాల రద్దీ - రాకపోకలకు ప్రజల అవస్థలు

బెజ్జూరు, మార్చి 31: రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలో ఆదివారం వార సంత కొనసాగుతుండగా వారసంత రోజు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఎదుర్కొంటున్నారు. వార సంత కావడంతో ప్రధాన రహదారిపై ఇరువైపులా వ్యాపారులు వివిధ రకాల సామగ్రిని విక్రయిస్తున్నారు. దీంతో ప్రధాన రోడ్డుగుండా వచ్చి పోయే వాహనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. రోడ్డుకు ఇరువైపులా వ్యాపారుల క్రయ విక్రయాలు చేపడుతుండడంతో ఒకే సారి ఎదురెదురుగా వచ్చే వాహనాలు రాక పోకలకు అంతరాయం కలుగుతుంది. దీంతో ఒక్కో సారి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వారసంత రోజు ప్రతి వారం ట్రాఫిక్ సమస్యతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రధాన రోడ్డు వెడల్పు పనులు పూర్తి చేసినప్పటికీ ప్రధాన రోడ్డుకు ఇరువైపులా క్రయ విక్రయాలతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి వార సంతరోజు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.



రోడ్డుపై విక్రయాలు జరుపుతున్న వ్యాపారులు



రోడ్డుపై నిలిచిన వాహనాలు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాండూర్, మార్చి 31: భీమిని మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన జైన మల్లేష్ (38) మంచిర్యాలలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మల్లేష్ తాండూర్ మండల కేంద్రానికి ఈ నెల 28న ఒక వివాహానికి రాగా అచ్చలాపూర్ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాలలోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

500 గ్రాముల గంజాయి పట్టివేత

చెన్నూరు, మార్చి 31: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఓ కిరాణ దుకాణంలో గంజాయిని పట్టుకున్నట్లు పట్టణ సీఐ రవీందర్ తెలిపారు. గ్రామానికి చెందిన బండం రాజు కిరాణ దుకాణంలో గంజాయి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు ఆదివారం దాడులు నిర్వహించగా 500 గ్రాముల ఎండిన గంజాయి, స్మోకింగ్ రోలింగ్, కోన్స్ పేపర్లు లభించాయన్నారు. అతని స్నేహితులు ఇర్ఫాన్, బిలాల్‌తో కలిసి మహారాష్ట్ర నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

వాహనాల తనిఖీ

చెన్నూరు, మార్చి 31: చెన్నూరు పట్టణంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల వివరాలను తెలుసుకున్నారు. సీఐ రవీందర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో అక్రమంగా మద్యం, నగదు తరలించకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత

కాసిపేట, మార్చి 31: సోమగూడెం చొప్పరిపల్లె చెక్‌పోస్టు వద్ద ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో రూ.98,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ గోదావరి ఖని నుంచి వాహనంలో బెల్లంపల్లికి వెళ్తున్న అలివర్ అర్జున్‌ను తనిఖీ చేయగా రూ.98,500 నగదు లభించిందన్నారు. నగదుకు ఎలాంటి ఆధారా లు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు. . కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఎస్‌టీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినులను వేధిస్తున్న ఆకతాయిల అరెస్టు

ఏసీసీ, మార్చి 31 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థినులను వేధిస్తున్న 22 మంది ఆకతాయిలను షీటీం పోలీసులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. శనివారం పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులను వేధిస్తున్న 13 మంది మేజర్‌లైన ఆకతాయిలపై కేసులు నమోదు చేయడంతో పాటు 9 మంది మైనర్లకు వారి కుటుంబీకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లు పట్టివేత

జైపూర్, మార్చి 31: కిష్టాపూర్ గోదావరి నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ట్రాక్టర్‌లను జైపూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చెన్నూరు, మార్చి 31: పట్టణంలోని బేతాలవాడలో పేకాట ఆడుతున్న వారిని ఆదివారం పట్టుకున్నట్లు సీఐ రవీందర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ బేతలవాడలోని రేవెల్లి మహేష్ ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.

బడుగు బలహీనవర్గాల అభివృద్ధికి కృషి

జైపూర్, మార్చి 31 : చెన్నూరు నియోజకవర్గంలోని బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని జై భీం సైనిక్‌దళ్ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు శీలం వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో చెన్నూరు నియోజకవర్గ అధ్యక్ష పదవి అప్పగించడంపై రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి దయాకర్, రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తం, జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల నరేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్, రమేష్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జాడి యేసయ్యలు వెంకటేష్‌ను సన్మానించారు.

ఎన్టీపీసీ 'రెండో దశ'తో ఒప్పందానికి నో!

2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణం.. కరెంటు కొనుగోలుకు సర్కారు విముఖత

- విద్యుత్తు వచ్చేది 5-8 ఏళ్ల తర్వాతే!
- అప్పటికి రూ.8-9 మధ్య యూనిట్ ధర
- ఒప్పందం చేసుకుంటే రాష్ట్రానికి గుదిబండే!



హైదరాబాద్ మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రెండో విడత తెలంగాణ సూపర్ థర్మల్ విద్యుత్తు కేంద్రం నుంచి కరెంటు కొనుగోలు చేస్తే రాష్ట్రానికి పెనుభారంగా మారే ప్రమాదం ఉందని ప్రభుత్వం అంచనా వేసింది. 2400 మెగావాట్ల సామర్థ్యంతో తలపెట్టిన ఈ విద్యుత్కేంద్రం నిర్మాణానికి ఐదు నుంచి ఎనిమిదేళ్ల పడుతుందని.. అప్పటికి ఇక్కడి నుంచి ఉత్పత్తయ్యే విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.8-9కి ఎగబాకుతుందని రాష్ట్ర ఇంధన శాఖ అంచనాకు వచ్చింది. బహిరంగ మార్కెట్లో ఇంతకంటే తక్కువ ధరకే విద్యుత్తు లభిస్తుండగా, భారీ ధరతో 25 ఏళ్ల పాటు కరెంటు కొనుగోలుకు దీర్ఘకాలిక ఒప్పందం చేసుకుంటే రాష్ట్ర ప్రజలపై రూ.వేల కోట్ల అనవసర భారం పడుతుందని తేల్చింది. ఈ నేపథ్యంలో ఎన్టీపీసీతో ఎలాంటి విద్యుత్తు కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. త్వరగా ఒప్పందం చేసుకోకపోతే ఇతర రాష్ట్రాలతో అగ్రిమెంట్ చేసుకుని విద్యుత్కేంద్రం నిర్మిస్తామని ఎన్టీపీసీ ఇటీవల అల్టిమేటం జారీ చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై సమీక్షించి, కొనుగోలు ఒప్పందం చేసుకోరాదని నిర్ణయించింది. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలో విద్యుత్తు కొరతను తీర్చడానికి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో 4000 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని పునర్విభజన చట్టం-2014లో కేంద్రం హామీ ఇవ్వగా, తొలి విడత కింద 1600 మెగావాట్ల విద్యుత్కేంద్రం నిర్మాణాన్ని ఇటీవల ఎన్టీపీసీ పూర్తి చేసింది. రెండో విడత కింద 2400 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించాల్సి ఉంది. తొలి విడత విద్యుత్తు ధర యూనిట్‌కు రూ.5.90 ఉండగా, ఒప్పందం కారణంగా కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఉంది.

గత సర్కారు తప్పిదమే..!

పదేళ్లలో గత ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రంలో విద్యుత్తు సంస్థలకు గుదిబండగా మారాయని కాంగ్రెస్ సర్కారు ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. రెండో విడతలో 2400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ఎన్టీపీసీతో ఒప్పందం చేసుకోకుండా 10 ఏళ్లపాటు జాప్యం చేయడమే దీనికి కారణమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అప్పట్లో ఒప్పందం చేసుకొని ఉంటే ఇప్పటికే నిర్మాణం పూర్తయి, తక్కువ ధరకు రాష్ట్రానికి కరెంటు వచ్చేదని చెబుతున్నాయి. ఇప్పుడు ఒప్పందం చేసుకుంటే భవిష్యత్తులో రాష్ట్రానికి గుదిబండగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కొత్త థర్మల్ ప్లాంట్లకు స్వస్తి..

దామరచర్లలో తెలంగాణ జెన్‌కో నిర్మిస్తున్న 4000 మెగావాట్ల యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నాలుగేళ్ల కిందే పూర్తి కావాల్సి ఉండగా, ఇంకా పనులు సాగుతున్నాయి. జాప్యంతో ప్రాజెక్టు నిర్మాణ వ్యయం పెరిగింది. కాలం చెల్లిన సబ్‌క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి విద్యుత్తు కేంద్రం వ్యయం సైతం భారీగా పెరగడంతో దాని విద్యుత్తు ధరలూ పెరిగిపోయాయి. యాదాద్రి, భద్రాద్రి ప్లాంట్ల నిర్మాణంలో తీవ్ర అవినీతి ఆరోపణలు రావడంతో కాంగ్రెస్ సర్కారు న్యాయ విచారణకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో మళ్లీ కొత్త థర్మల్ విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం జోలికి వెళ్లవద్దని ప్రభుత్వం ఓ అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ప్రత్యామ్నాయంగా మార్కెట్‌లో రూ.2-4కు యూనిట్ చొప్పున లభిస్తున్న పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించింది. సౌర, జల, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజ్ విద్యుత్తుపై దృష్టిపెట్టాలని నిర్ణయించింది.

బాసర ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

(మొదటిపేజీ తరువాయి)

సెంట్రల్ స్టోర్‌లో ఉన్న సరుకులను పరిశీలించారు. సరుకుల నాణ్యత, బ్రాండ్‌లు రికార్డుల్లో పేర్కొన్న ప్రకారం ఉన్నాయో లేదో సరి చూశారు. టెండరులో ఉన్న బ్రాండ్‌లు, క్వాలిటీ కాకుండా ఇతర సరుకులు ఉన్నట్లు, రికార్డుల్లో ఉన్న సరుకులకు, స్టోర్ రూమ్‌లో ఉన్న సరుకుల లెక్కలకు తేడాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో దాదాపు 5 గంటల పాటు రికార్డులను పరిశీలించారు. సరుకుల కొనుగోళ్లకు సంబంధించిన ప్రతీ బిల్లును తనిఖీ చేశారు. జాబితాలో దాదాపు 70 శాతానికి పైగా సరుకుల ధరలు మార్కెట్ రేటు కంటే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఈ విషయంలో ఆలయ అధికారులపై విజిలెన్స్ అధికారి అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎంఆర్పీ కూడా చూడకుండా టెండరును ఎలా నిర్ధారణ చేస్తారని అధికారులను ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా రావడంతో ఆలయ ఈవో హైదరాబాద్ నుంచి హుటాహుటిన బాసర వచ్చారు. కాగా, విజిలెన్స్ అధికారుల ఇచ్చే నివేదిక ఆధారంగా దేవాదాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

పంట నష్టం పరిహారమేదీ?

ఏడాదిగా ఎదురుచూస్తున్న రైతన్నలు.. గతేడాది మార్చి, ఏప్రిల్‌లో 1,51,545 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తామన్న గత ప్రభుత్వం
- నేటికీ అందని రెండో విడత పంట నష్టపరిహారం
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఇవ్వాలని రైతుల వేడుకోలు



జగిత్యాల జిల్లా మోరపల్లిలో నేలవాలిన మొక్కజొన్న (ఫైల్)

జనగామ/జగిత్యాల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలు ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలు అకాలవర్షానికి నేలపాలయ్యాయి. వడగళ్ల వానలు, ఈదురుగాలులు పంటలను అతలాకుతలం చేశాయి. రైతన్న వేదనను చూసిన ప్రభుత్వం.. వారికి పంట నష్టపరిహారం ఇచ్చి ఆదుకుంటామని హామీ ఇచ్చింది. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తామని చెప్పింది. కానీ, ఏడాది కాలం గడిచిపోతున్నా.. ఇప్పటికీ రైతులకు పరిహారం అందలేదు. ఇంకా వారికి ఎదురుచూపు తప్పలేదు. గతేడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో కురిసిన అకాల వర్షాలకు రాష్ట్రవ్యాప్తంగా అధిక విస్తీర్ణంలో వరి, మామిడి, మొక్కజొన్న తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కోత దశకు వచ్చిన పంట కావడంతో వడగళ్ల దెబ్బకు గింజలన్నీ నేలరాలి రైతులకు కడగళ్లను మిగిల్చాయి. అధికారుల ద్వారా పంట నష్టం వివరాలను తెప్పించుకున్న నాటి ప్రభుత్వం.. నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లిస్తామని చెప్పినా.. కేవలం మార్చి నెలకు సంబంధించిన పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే మార్చి నెలలో జరిగిన నష్టం కన్నా ఏప్రిల్‌లో రెట్టింపు నష్టం సంభవించింది. కానీ, ఏప్రిల్‌లో జరిగిన నష్టానికి సంబంధించిన పరిహారాన్ని మాత్రం రైతులకు నేటికీ ఇవ్వలేదు. ఇందుకోసం రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఆనాడు ప్రకటించినా రైతుల ఖాతాల్లో మాత్రం జమ కాలేదు.

రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం..

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.28 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్న విషయాన్ని నాడు ఖమ్మం జిల్లాలో పంటల పరిశీలన సందర్భంగా అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇందులో మొక్కజొన్న 1,29,446 ఎకరాలు, వరి 72,709 ఎకరాలు, మామిడి 8,865 ఎకరాల్లో నష్టపోయిందని పేర్కొన్నారు. గతేడాది మార్చి 23న ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో కేసీఆర్ పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పంటనష్టం జరిగిన 26 జిల్లాల్లో వ్యవసాయాధికారులు సర్వే నిర్వహించి 1,51,545 ఎకరాల్లో నష్టం జరిగినట్లు తేల్చారు. దీనికి సంబంధించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.151.54 కోట్లు విడుదల చేస్తున్నట్లు గతేడాది జూన్‌లో కేసీఆర్ సర్కారు ప్రకటించింది. మొత్తం 1,30,988 మంది రైతులు పరిహారానికి అర్హులుగా పేర్కొంది. అయితే మార్చి నెల పరిహారాన్ని మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాగా, జగిత్యాల జిల్లాలో గతేడాది మార్చి, ఏప్రిల్‌తోపాటు జూలైనూ కలిపి 73,686 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నాయి. ఇందులో మార్చిలోనే 6,199 ఎకరాల్లో పంటలు దెబ్బతినగా.. కేవలం 532 ఎకరాలకే పరిహారం చెల్లించారు. ఏప్రిల్‌లో 52 వేల ఎకరాల్లో, జూలైలో భారీ వర్షాలకు 15,487 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లగా.. ఇప్పటివరకు పరిహారం ఇవ్వలేదు. మొత్తంగా రెండో విడతకు సంబంధించి 20,160 మంది రైతులకు పరిహారం కింద రూ.36.69 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆర్థిక శాఖలో పెండింగ్..

రెండో విడత పంట నష్టం పరిహారానికి సంబంధించిన నిధులు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో 2 విడతలకు సంబంధించి రూ.151.54 కోట్లు విడుదల చేయగా వాటికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభించలేదని అధికారులు చెబుతున్నారు. క్లియరెన్స్ వస్తే నేరుగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశముంది. దీనిపై కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఏడు ఎకరాల్లో పంట నష్టపోయాను



గతేడాది యాసంగిలో ఏడెకరాల్లో వరి పంట సాగు చేస్తే వడగళ్లు, ఈదురుగాలుల కారణంగా పంటంతా నాశనమైంది. చేతికొచ్చిన గింజలన్నీ చేలోనే రాలిపోయి ఏమీ చేతికిరాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అధికారులు సర్వే చేసి పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు. కానీ, ఏడాది దాటుతున్నా ఒక్క పైసా పరిహారం రాలేదు. అధికారులను అడిగితే ప్రభుత్వం వద్దే పైసలు ఆగిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పరిహారాన్ని అందించాలి.

- గొడ్డేటి రాజు, గానుగుపహాడ్, జనగామ జిల్లా

రేపు తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనం రద్దు

తిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నెల తొమ్మిదో తేదీన ఉగాది ఆస్థానం సందర్భంగా మంగళవారం శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం (ఆలయ శుద్ధి) నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుండటంతో వీఐపీ బ్రేక్‌ను టీటీడీ రద్దు చేసింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను రద్దు చేసిన విషయం తెలిసిందే. ప్రొటోకాల్ పరిధిలో స్వయంగా వచ్చే వీఐపీలకు, ట్రస్టు దాతలకు మాత్రమే బ్రేక్ దర్శన టికెట్లను జారీ చేస్తున్నారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నేపథ్యంలో వీటిని కూడా రద్దు చేస్తున్నట్టు టీటీడీ తెలిపింది. కాగా, ఎన్నికల కోడ్ నేపథ్యంలో తిరుమల శ్రీవారి శ్రీవాణి ట్రస్టుకు గడిచిన 15 రోజుల్లో రూ.22.75 కోట్ల విరాళాలు అందాయి. ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16వ తేదీ నుంచి వీఐపీ బ్రేక్ సిఫారసు లేఖలను టీటీడీ రద్దు చేసింది. ఈ క్రమంలో శ్రీవాణి ట్రస్టుకు రూ.10వేల విరాళం అందించి రూ.500 బ్రేక్ దర్శన టికెట్లను కొనుగోలు చేసే వారి సంఖ్య పెరిగింది.

బెంగాల్‌లో తుఫాను బీభత్సం

- నలుగురి మృతి, 200 మందికి గాయాలు

కలకత్తా, మార్చి 31: పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయిగురి జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ తుఫాను కారణంగా పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. చెట్లు, హోర్డింగులు, కరెంటు స్తంభాలు నేల కూలాయి. పలు వాహనాలు తిరగబడ్డాయి. దాంతో నలుగురు మృతి చెందగా, 200 మందికిపైగా గాయపడ్డారు. మృతి చెందిన వారికి పశ్చిమ బెంగాల్ సీఎం మమత సానుభూతి తెలిపారు. వారి కుటుంబసభ్యులకు తగిన పరిహారం అందజేస్తామని ప్రకటించారు. గాయపడిన వారికి ప్రభుత్వమే చికిత్స అందిస్తుందని హామీ ఇచ్చారు. కల్లోలిత ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా అధికారులను ఆదేశించారు. బెంగాల్ వరదల్లో మరణించిన వారికి ప్రధాని మోదీ సానుభూతి ప్రకటించారు.

జగన్ నిర్వాకంతో ఏపీ ఖజానా ఖాళీ

అప్పు తీసుకోకపోతే పూటైనా గడవదు... పింఛన్లు ఇవ్వడానికి డబ్బు లేక టీడీపీపై నెపం మోపే యత్నం: చంద్రబాబు

- మార్కాపురం, ఎమ్మిగనూరు, బాపట్లల్లో భారీ బహిరంగ సభలు



బాపట్ల/కర్నూలు/ఒంగోలు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయి ఖజానా ఖాళీ అయిందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. అప్పు తీసుకోకపోతే పూటగడవని స్థితికి ప్రభుత్వం చేరుకుందన్నారు. ప్రస్తుతం పింఛన్లు ఇవ్వడానికి కూడా డబ్బు లేక.. ఆ నెపం టీడీపీపై మోపే ప్రయత్నం చేస్తున్నాడని ధ్వజమెత్తారు. ప్రజాగళం యాత్రలో భాగంగా ఆదివారం ఆయన ప్రకాశం జిల్లా మార్కాపురం, కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు, బాపట్ల జిల్లా కేంద్రంలో జరిగిన భారీ బహిరంగ సభల్లో ప్రసంగించారు. జగన్ ఈ ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పు చేశాడని, వాటిని ఆయన రోత పత్రిక తీరుస్తుందా.. భారతీ సిమెంట్స్ తీరుస్తుందా అని నిలదీశారు. ఈ సీఎం నమ్మించి గొంతు కోసే రకమని దుయ్యబట్టారు. రాయలసీమ బిడ్డనని చెప్పుకొంటూ ఈ ప్రాంతానికి ఏమీ చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో 52 అసెంబ్లీ స్థానాలుంటే గత ఎన్నికల్లో 49 మంది వైసీపీ ఎమ్మెల్యేలను గెలిపించారని.. కానీ ఒక్క పనైనా చేశాడా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టయినా పూర్తి చేశాడా.. కర్నూలు ప్రాంతానికి కనీసం నీళ్ల ఇవ్వాలన్న ఆలోచనైనా చేశాడా.. పేదలు, యువత భవిష్యత్ గురించి ఆలోచించాడా అని నిలదీశారు. ఆయన రాయలసీమ ద్రోహి అని.. ఒక్క ఓటు వేసినా మన నెత్తిన మనమే చెత్తవేసుకున్నట్లు అవుతుందని హెచ్చరించారు. బటన్ నొక్కి ప్రజల సంక్షేమమని ప్రతిరోజూ చెబుతున్నాడని.. అలాగైతే మద్య నిషేధం, జాబ్ కేలెండర్, డీఎస్సీలపై ఎందుకు నొక్కలేదని ప్రశ్నించారు. తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచాడని.. ఆర్టీసీ, పెట్రోలు, డీజిల్, నిత్యావసరాల ధరలు పెరిగి జనం అల్లాడుతుంటే.. వాటిని తగ్గించే బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. 'సంక్షేమం పేరుతో రూ.10 ఇచ్చి రూ.100 లాగేసుకుంటున్నాడు. బటన్ నొక్కి ఇచ్చింది ఎంత? ప్రజల నుంచి నొక్కింది ఎంత? అందులో మీరు బొక్కింది ఎంత' అని నిలదీశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీ కన్నా తెలంగాణలో తలసరి ఆదాయం 35 శాతం అధికంగా ఉంటే 2014-19లో దానిని 27 శాతానికి తగ్గేలా చేశామని.. జగన్ వచ్చాక తేడా 45 శాతానికి పెరిగిందని.. బటన్ నొక్కి పేదల సంక్షేమం చేస్తే ఇంత వ్యత్యాసం ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. ఐదేళ్లుగా రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న శని మే 13తో విరగడైపోతుందని చెప్పారు.

ఫ్యాన్ చెత్తబుట్టలోకే..

ఈ ఎన్నికల్లో ఫ్యాన్ ముక్కలై చెత్తబుట్టలో పడే యడం ఖాయమని చంద్రబాబు అన్నారు. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదని, విధ్వంసకర వైసీపీ పాలన అంతం కావాలన్న ఉద్దేశంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తుకు ఆద్యుడు పవన్. మూడు పార్టీలు కలవడం మాకోసం, మా రాజకీయాల కోసం కాదు. ప్రజలు గెలవాలి, ఏపీ బాగుండాలన్న ఉద్దేశంతోనే! ఈ విషయాన్ని ప్రజలంతా గుర్తించాలి. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేయాలంటే కేంద్రం సహకారం అవసరం. రాష్ట్ర ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. మేం కలిస్తే జగన్ ఎందుకు కంగారు పడుతున్నాడు? ముస్లింలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాడు. ఎన్డీయే అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు పోతాయని రెచ్చగొడుతున్నారు" అని మండిపడ్డారు.

కూటమి విజయం ఖాయం: పవన్

- వైసీపీ దోపిడీని అరికడితే అన్ని పథకాలకు నిధులు వస్తాయి
- పింఛన్లు అందేలా చూడండి.. 3 పార్టీల నేతలకు జనసేనాని పిలుపు



పిఠాపురం, మార్చి 31: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో విజయం సాధించి రాబోయేది జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి ప్రభుత్వమేనని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. భారీ మెజారిటీతో సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకం ఆగిపోదని.. ఈ విషయాన్ని స్పష్టంగా అందరికీ తెలియజేయాలని మూడు పార్టీల నేతలకు పిలుపిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో ఆదివారం పిఠాపురం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసి సైబరాబాద్ వంటి ప్రత్యేక నగరాన్ని తయారు చేసిన అనువజ్ఞుడు, టీడీపీ అధినేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అకారణంగా, కక్షపూరితంగా జైలులో పెట్టినప్పుడు బాధేసిందని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. రాజమహేంద్రవరం వెళ్తున్నప్పుడు దారిపొడవునా టీడీపీ కార్యకర్తలు తమ నాయకుడి కోసం పడిన తపన తనను కదిలించిందని, అందుకే సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిశాక తన వంతుగా ఏదైనా చేయాలని భావించి కచ్చితంగా వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి వెళ్తాయని ప్రకటించానని ఆయన తెలిపారు. అప్పుడు తాను చెప్పినట్లుగానే బీజేపీ తమతో కలిసి వచ్చిందని చెప్పారు. ఆ పార్టీ కోసం ఎంపీ సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తాను పొత్తు కోసం ఎంత తపించానో.. మూడు పార్టీల నాయకులు గెలుపు కోసం అంతే కష్టపడాలని సూచించారు. చిన్న చిన్న ఇబ్బందులు ఉన్నా వాటిని అధిగమించి పనిచేయాలని కోరారు. 'ఇప్పుడు ఇస్తున్న పథకాల కంటే అధికంగానే సంక్షేమ ఫలాలు పంచుతాం. మద్యం, గంజాయి, ఇసుక, ల్యాండ్ మాఫియా వంటి వాటిని అరికడితే అన్ని పథకాలకు కచ్చితంగా డబ్బులు సర్దుబాటవుతాయి. వైసీపీ దోపిడీ అరికడితే అప్పులు చేయకుండానే సంక్షేమ పథకాలు అమలు చేయవచ్చు. ఎన్నికల కోడ్ వల్ల ప్రతినెలా ఒకటో తేదీన అందాల్సిన సామాజిక పింఛన్లు ఈ నెల ఆలస్యం కావచ్చు. వలంటీర్లు లేకుండా పింఛన్లు సక్రమంగా పంపిణీ చేసేందుకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల నియామవళికి అనుగుణంగా అధికారులకు సహకరించాలి' అని సూచించారు.

ఉత్తరాదిపై మజ్లిస్ గురి!

- యూపీ, బిహార్‌లో ఖరారైన పొత్తులు
- వ్యూహాత్మకంగా హిందువులకూ టికెట్లు

హైదరాబాద్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్ పాతనగరంలో.. ఎంసీహెచ్(ప్రస్తుతం జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పత్తర్‌గట్టీ డివిజన్ నుంచి విజయభేరీ మోగించిన మజ్లిస్ ఇత్తేహాదుల్ ముస్లిమీన్(ఎంఐఎం) క్రమంగా జాతీయ పార్టీగా ఎదుగుతోంది. ఈ క్రమంలో బిహార్, యూపీల్లో ఓటుబ్యాంకును.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటూ ముందుకు పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తమకు సిటింగ్ స్థానం ఉన్న మహారాష్ట్రతో పాటు.. యూపీ, బిహార్‌పై ప్రత్యేకంగా దృష్టిసారించింది. "మేము బీజేపీకి వ్యతిరేకం. అలాగని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి మద్దతు కాదు. ఇండియా కూటమి కేవలం ఎన్నికల అవసరాలకే పరిమితం. మైనారిటీ, బడుగు వర్గాల అభ్యున్నతికి మేం పనిచేస్తాం" అని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. యూపీలో డాక్టర్ పల్లవి పటేల్ నాయకత్వంలోని అప్నాదళ్(కామెరవాడి)తో కలిసి పోటీ చేస్తామని ఆదివారం ఆయన ప్రకటించారు. ప్రగతిశీల మానవ్ సమాజ్ పార్టీ, రాష్ట్రీయ ఉదయ్ పార్టీతోనూ పొత్తు ఉంటుందని, బిహార్‌లోనూ ఎన్డీయే-ఇండియా కూటముల్లో లేని పార్టీలను కలుపుకొనిపోతున్నట్లు వివరించారు. ఉత్తరప్రదేశ్‌లో ఏడు, బిహార్‌లో 11 స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు తెలిపారు. బిహార్‌లో ఐదు చోట్ల హిందువులకు మజ్లిస్ టికెట్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఎంవీఏతో కలిసి పోటీ చేసిన మజ్లిస్.. ఈ సారి ఒంటరిగా వెళ్తోంది. తమ పార్టీ ఔరంగాబాద్ సిటింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ అదేస్థానంలో పోటీ చేయనుండగా.. మైనారిటీల బలం ఎక్కువగా ఉన్న మరో నాలుగు చోట్ల మజ్లిస్ బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. కర్ణాటకలో సమీకరణాలు అనుకూలంగా లేనందున పోటీ చేయడం లేదని మజ్లిస్ వర్గాలు తెలిపాయి.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
మంచిర్యాల జిల్లా వార్తలు
3
సోమవారం 1 ఏప్రిల్ 2024



అల్పాహారం పంపిణీ

బెల్లంపల్లి, మార్చి 31: తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మార్కెట్ చౌరస్తా వద్ద భవన నిర్మాణ కార్మికులకు, కూలీలకు అల్పాహారం పంపిణీ చేశారు. ప్రతీ ఆదివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నాయకులు రత్నం రాజన్న, రంగ రామన్న, గెల్లి జయారాంయాదవ్, వెంకటరాజం, రాజ్‌కుమార్, కనకయ్యగౌడ్, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:31 సోమవారం
సహర్ | 4:47 మంగళవారం

యేసుక్రీస్తు లోక రక్షకుడు



మంచిర్యాల సీఎస్ఐ చర్చిలో సందేశం అందిస్తున్న పాస్టర్

● ఘనంగా ఈస్టర్ డే ● చర్చిల్లో ప్రార్థనలు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 31: యేసుక్రీస్తు లోక రక్షణ కోసం మరణించి పునరుత్థానం పొందాడని పాస్టర్, హైద్రాబాద్ ఏసీటీసీ కాలేజీ ప్రొఫెసర్ ఫాదర్ హెలెన్ సలోమి పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో హమాలీ వాడలోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే రోజు సిలువపై అసువులు బాసిన యేసు ప్రభువు మూడో రోజున సమాధి నుంచి భక్తులకు దర్శనమివ్వడంతో ఈస్టర్ పండగను జరుపుకొంటున్నామన్నారు. యేసు లోక రక్షకుడని, ఆయన మార్గంలో అందరూ నడవాలన్నారు. కరుణ, శాంతి, సహనంతో అందరు జీవించాలన్నారు. చర్చి ఇన్‌చార్జి శ్రీనివాస్, పాస్టర్‌లు వెంకటరాజం, కిష్టఫర్ రాజ్, పద్మారావు, కమిటీ సభ్యులు ప్రేమయ్య, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాలో ఈస్టర్ డే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున చర్చిలలో క్రైస్తవులు కొవ్వొత్తులు వెలిగించి పాటలు ఆలపించారు. పాస్టర్లు మాట్లాడుతూ యేసు క్రీస్తు ప్రపంచ మానవాళి రక్షణ కోసం మృత్యుంజయుడుగా లేచాడన్నారు. శుభ శుక్రవారం రోజున శిలువ పై మరణించిన యేసుక్రీస్తు ఆదివారం పునరుత్థానమయ్యారని పాస్టర్‌లు వివరించారు. అనంతరం ఆయా చర్చిలో యేసుక్రీస్తు శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి శిలువ చుట్టు తిరుగుతూ ప్రత్యేక పార్థనలు చేశారు. పాస్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు, ఫాదర్లు, పాస్టర్లు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్లు జోబి, రాజేష్, సుధీర్‌తో పాటు క్రైస్తవులు పాల్గొన్నారు.

హాజీపూర్: మండలంలోని ముల్కల్ల గ్రామంలో గల రఫా చర్చిలో ఈస్టర్ వేడుకలను పాస్టర్ శామ్యూల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ యేసు సందేశాన్ని వినిపించారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిధి లోని సీఎస్ఐ చర్చిలో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు సిలువ వెలిగింపు కార్యక్రమాన్ని ప్రెసిడెంట్ ఎం కళావతి జాషువా, సెక్రెటరీ ప్రేమలత నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ జాషువా మాట్లాడుతూ యేసు క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచిన దినాన్ని పురస్కరించుకొని ఈస్టర్ పండుగ ఆరాధనలు నిర్వహిస్తున్నామన్నారు. ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని పలు చర్చీల్లో ఈస్టర్ డే వేడుకలను నిర్వహించారు. చర్చీల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఫాదర్లు ఈస్టర్ డే ప్రాముఖ్యతను వివరించారు.



రామకృష్ణాపూర్‌లో చర్చిలో పాల్గొన్న మహిళలు



దండేపల్లిలో దీపాలు వెలిగిస్తున్న క్రైస్తవులు



తనిఖీలు శూన్యం ఆర్‌ఎంపీల ఇష్టారాజ్యం

- నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు
- జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీల తీరు
- పట్టించుకోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు

బెల్లంపల్లి, మార్చి 31: వైద్యులను దేవునితో పోలుస్తారు. అలాంటి వైద్య వృత్తిని కొందరు రిజిస్టర్ మెడికల్ ప్రాక్టిషనర్స్ (ఆర్‌ఎంపీ)లు మచ్చతెస్తున్నారు. ప్రథమ చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీలు ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకుని వైద్యం పేరుతో అడ్డంగా దోచుకుంటున్నారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తుండగా మరికొందరు అనుమతులు లేకుండా క్లీనిక్‌లు నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా ల్యాబ్‌లను, పడకలను ఏర్పాటు చేసి రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆర్‌ఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి. కానీ ఎంబీబీఎస్ వైద్యుల తరహాలో వైద్యం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించి హెచ్చరించినప్పటికీ వారి తీరు మారడం లేదు.

● నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు

జిల్లాలో దాదాపు వెయ్యి మందికి పైగా ఆర్‌ఎంపీలు ఉన్నారు. వీరు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి. ప్రథమ చికిత్స కేంద్రానికి ఎలాంటి పేరు పెట్టకూడదు. అతని పేరు కూడా డాక్టర్‌గా రాసుకో కూడదు. కట్లు కట్టడం, సెలైన్ ఎక్కించడం, ఇంజక్షన్‌లు వేయడం చేయకూడదు. గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు వైద్య చికిత్సలు చేయకూడదు. రక్త పరీక్షలు చేయడానికి ల్యాబ్‌లు, చికిత్స కోసం పడకలు ఏర్పాటు చేయకూడదు. అలాగే షుగరు, రక్తపరీక్షలతోపాటు స్కానింగ్ తీసుకోవాలని ఎలాంటి సిఫారసులు చేయకూడదు. వీటన్నింటికి విరుద్ధంగా ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు ఆర్‌ఎంపీలు వైద్యం పేరుతో దోచుకుంటున్నారు.

● పట్టించుకోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు

ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలందిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో, తండాల్లో ప్రజలకు టైఫాయిడ్, మలేరియా, డెంగీ, ఇతర వ్యాధుల బారిన పడుతున్న సమయంలో ఆర్‌ఎంపీలు వైద్యం చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో కొందరు పట్టణ ప్రాంతాల్లోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో కొంత కాలంగా పనిచేసిన వ్యక్తులు తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీలుగా అవతారం ఎత్తుతున్నారు. అరకొర వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అలాగే రక్తమూత్ర పరీక్షలు చేయించుకోవాలని ల్యాబ్ టెక్నిషియన్‌లతో పర్సంటేజీలు మాట్లాడుకుని రోగులను దోచుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులతో కుమ్మక్కై రోగులను రెఫర్ చేస్తూ బిల్లులో 20 శాతం నుంచి30 శాతం వరకు కమీషన్లు తీసుకుంటున్నారు. గతంలో జిల్లాలో ఆర్‌ఎంపీల వైద్యం వికటించి మృతి చెందిన సంఘటనలు సైతం ఉన్నాయి. మృతుల కుటుంబాలు గొడవ చేస్తే నష్టపరిహారం సైతం చెల్లించిన సంఘటనలు ఉన్నాయి. ఆర్ ఎంపీల తతంగం జిల్లావైద్యఆరోగ్య శాఖ అధికారుల దృష్టికి రావడంతో ఇటీవల ఆర్‌ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసి పరిమితికి మించి వైద్యం అందిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హతకు మించి వైద్యం అందించవద్దని హెచ్చరించినప్పటికీ కొందరు ఆర్‌ఎంపీల తీరులో మార్పు రాలేదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆర్‌ఎంపీల క్లీనిక్‌లను తనిఖీలు చేయకపోవడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

- సుబ్బారాయుడు, డీఎంహెచ్‌వో

ఆర్‌ఎంపీలు కేవలం ఫస్ట్‌ఎయిడ్ మాత్రమే చేయాలి. ఆర్‌ఎంపీలతో సమావేశం నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందించవద్దని హెచ్చరించాం. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా వైద్యం అందిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఆర్‌ఎంపీలు నిబంధనల ప్రకారం ప్రజలకు వైద్య సేవలు అందించాలి.

ఎన్నికల్లో ప్రజాస్వామ్య వాదుల్ని గెలిపిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలవేన శంకర్

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య వాదుల్ని గెలిపిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసేందుకు జిల్లా నాయకత్వం కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యవాదుల గెలుపునకు సీపీఐ కృషి చేస్తుందన్నారు. దేశంలోని సహజ సంపదలను, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెబుతున్న బీజేపీని ఓడించాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు రాజమొగిలి, మేకల దాసు, ఖలీందర్‌అలీఖాన్, రేగుంట చంద్రశేకర్, వెంకటస్వామి,వీర భద్రయ్య, మల్లయ్య,పూర్ణిమ, నగేష్, శ్రీనివాస్, బాజీసైదా, సమ్మయ్య, పౌలు, దుర్గరాజ్, పోచన్న తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 31: మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కార్యాలయాన్ని రాష్ట్ర నాయకులు నాయకోటి రాజు, శేషగిరిరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. మోటపలుకుల సత్తయ్య, బొమ్మ సత్యనారాయణరెడ్డి, సుదమల్ల కృష్ణ, మహేందర్ , రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ మోహన్

భీమారం, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరు పోలీసులకు సహకరించాలని సీఐ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆవడం ఎక్స్‌రోడ్డులో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ధర్మారం గ్రామంలో ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల్లో అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చర్యలు తీసుకొంటామన్నారు. ప్రజలందరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎస్‌ఐ రాములు, పోలీసులు పాల్గొన్నారు.

రైతులను దోపిడీ చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

ఏసీసీ, మార్చి 31: రైతులను అన్ని విధాలుగా దోపిడి చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ పంటలను పరిశీలించడానికి వెళ్లడం రైతులపై కపట ప్రేమ నటించడమేనన్నారు. కరువు అనేది బీఆర్ఎస్ పాలనలోనే మొదలైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతుబంధు డబ్బులను ఎన్నికల కమిషన్ సాకు చూపి కాంట్రాక్టర్‌లకు ఇచ్చి అందులో నుంచి కమీషన్లు పొందారన్నారు. తొమ్మిదిన్నరేండ్లలో పంట నష్టం జరిగినా, రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా కేసీఆర్ వెళ్లి చూశారా అని ప్రశ్నించారు. మంచిర్యాల పట్టణం వరద ముంపునకు గురైతే బాధితులకు పరిహారం చెల్లించకుండా జిల్లాకు మొండి చేయి చూపారన్నారు. ఇటీవల వడగండ్ల వాన వల్ల పంట నష్టం జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే సమీక్ష నిర్వహించి ఎకరానికి రూ.10 వేలు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేశామన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకుంటున్నారని, కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ లాభాల బాట పట్టిందన్నారు. 41 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు మార్చిలో జీరో బిల్లు వచ్చిందన్నారు. ఐకేపీ డ్వాక్రా మహిళలకు అందించే రుణ పరిమితిని పెంచడంతోపాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పంట బీమా అమలు చేస్తామన్నారు. కౌలుదారులు, పట్టాదారులకు రైతు భరోసా కల్పిస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నియోజకవర్గానికి 3,500 లబ్ధిదారుల జాబితా తయారు చేస్తున్నట్లు, నిరుపేదలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. కేసీఆర్ పది సంవత్సరాలు రాష్ట్రంలో నియంతృత్వ పాలన చేశారని, ఎన్నికల్లో ఓడిపోయిన వంద రోజుల్లోనే బీఆర్ఎస్ చెల్లా చెదురైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, రైసుమిల్లర్లు, డీసీఎంఎస్ చైర్మన్ కలిసి రైతులను క్వింటాల్‌కు పది కిలోల వంతున తరుగు పేరిట దోపిడీ చేశారని, ఆ సొమ్ము కక్కిస్తామన్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి మూడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరయ్యాయని, మంచిర్యాల, దండేపల్లి, హాజీపూర్‌లలో నెలకొల్పనున్నట్లు తెలిపారు. వరదల నుంచి పట్టణాన్ని రక్షించడానికి రాళ్లవాగు, గోదావరికి కరకట్టల నిర్మాణానికి నిధులు మంజూరయ్యారని తెలిపారు. నియోజకవర్గానికి నాలుగు కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు మంజూరయ్యాయని, పడ్తన్‌పల్లి ఎత్తిపోతల పథకం పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. మంచిర్యాల పెద్దపల్లి జిల్లాను కలుపుతూ గోదావరి నదిపై ముల్కల్ల సమీపంలో రూ. 400 కోట్లతో ఫోర్‌లైన్ హైలెవెల్ బ్రిడ్జి నిర్మిస్తామన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ చైర్మన్‌లు ఉప్పలయ్య, వేణు, నాయకులు చిట్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

మంచిర్యాల పట్టణంలోని 13, 25 వార్డుల్లో డీఎంఎఫ్‌టీ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ నల్ల మహేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంట్లో మంత్రి అల్పాహారం



అల్పాహారం చేస్తున్న మంత్రి సీతక్క

ఏసీసీ, మార్చి 31: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆదివారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు నివాసానికి వచ్చారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న మంత్రి ఎమ్మెల్యే నివాసంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం మంత్రి సీతక్కను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, చిట్ల సత్యనారాయణ, జోగుల సదానందం పాల్గొన్నారు.

108లో ప్రసవం

జన్నారం, మార్చి 31: మండలంలోని కవ్వాల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్యామలకు ఆదివారం పురుటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో శ్యామలను జన్నారంలోని ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురుటి నొప్పులు ఎక్కువయ్యాయి. పైలెట్ రఫీక్, ఈఎంటీ కిషన్‌లు పురుడు పోయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు.

బియ్యం అందజేత

భీమారం, మార్చి 31: ఖాజీపల్లి గ్రామానికి చెందిన దుర్గం దుర్గ కూతురు కృష్ణవేణి వివాహానికి ఆర్‌కే ఫౌండేషన్ సభ్యులు క్వింటాల్ బియ్యం అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భుక్య రాజ్‌కుమార్ నాయక్, మాజీ సర్పంచు కొండా చందు, ఉపసర్పంచు రాజలింగు, భుక్య రాజేష్‌నాయక్, కొమ్ము అశోక్‌యాదవ్, టీరేష్, మల్లేష్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో బీజేపీ అధికారం ఖాయం

మందమర్రిటౌన్, మార్చి 31: పార్లమెంట్ ఎన్నికల్లో 400 సీట్లు బీజేపీ సాధించడం ఖాయమని బీజేపీ జిల్లాప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ తెలిపారు. ఆదివారం మందమర్రిలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశ భద్రత, ప్రజల సంక్షేమం మోదీతోనే సాధ్యమన్నారు. మూడోసారి మోదీ ప్రధాని అవుతారన్నారు. రాష్ట్రంలో 10 సీట్లను బీజేపీ గెలుస్తుందన్నారు. బీజేపీ నాయకులు డీపీ దీక్షితులు, కుమారస్వామి పాల్గొన్నారు.

అనంతరం మందమర్రి పట్టణ కమిటీని ఆదివారం ఏకగ్రీవం గా ఎన్నుకున్నారు. పట్టణ వాణిజ్య సెల్ విభాగం అధ్యక్షుడిగా బొడ్ల భూపతి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా భీం, పట్టణ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా రాజమౌళి, రాంకిష్టయ్య, రమేష్, బైరి శ్రీనివాస్, శ్రీనివాస్, ఎస్సీమోర్చా పట్టణ ఉపాధ్యక్షుడిగా మేరుగు తిరుపతిలను ఎన్నుకున్నారు.

బెల్లంపల్లి: బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు కోడి రమేష్ బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం బీజేపీ నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి, కేశవ్‌రెడ్డి, గోవర్ధన్, రమేష్, రాజులాల్‌యాదవ్, శ్రీనివాస్, ప్రకాష్, శ్రావణ్‌కుమార్, సురేష్, శ్రీనివాస్, దీపారాణి,మోహన్, రాములు, కమల్ లాహోటి , సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ తల్లి కొలుపు



జడ్పీ చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మందమర్రిటౌన్, మార్చి 31: ప్రాణహిత కాలనీలో పోచమ్మ తల్లి తిరుగు కొలుపు పూజలను ఆదివారం నిర్వహించారు. కాలనీవాసులు బోనాలతో తరలివచ్చి మేకలను, కోళ్లను బలిచ్చారు. ఆలయ పూజారులు మేకలను నోటితో గావు పట్టారు. జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సీవోఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విజయ సంకేతం చూపుతున్న బెల్లంపల్లి సీవోఈ విద్యార్థులు

బెల్లంపల్లి, మార్చి 31: ప్రీమియర్ సీవోఈ ఫలితాలు శనివారం రాత్రి విడుదల కాగా బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయానికి చెందిన 14 మంది సీవోఈలో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఆదివారం తెలిపారు. గౌలిదొడ్డిలోని సీవోఈలో అల్లాటి వినయ్, మేరుగు అజయ్‌కుమార్, దాగం సాయిసిద్దార్థ, గుమ్మడి ఉజ్వల్, దుగుట సౌమిత్, దుర్గం నవీన్, గోమాస అభిషేక్, బొల్లం అభినవ్ తేజ్‌లు సీట్లు సాధించారు. అలాగే అల్గునూరు సీవోఈలో జాడి ప్రఫుల్, గొల్లమాడ చక్రధర్, చిలుముల రాకేష్, దుర్గం కార్తీక్‌లు, చిల్కూరు సీవోఈలో సూర్యవంశీ కరన్ కుమార్, ఇబ్రహీంపట్నంలోని సీవోఈలో సాయి విగ్నేష్‌లు సాధించినట్లు తెలిపారు. పోటీని తట్టుకుని బెల్లంపల్లి విద్యార్థులు సీట్లు సాధించడంతో ఆర్‌సీవో కొప్పుల స్వరూపరాణి విద్యార్థులను అభినందించారు.